Cover Page

DOI: http://ijmer.in.doi./2023/12.12.20.3.39
www.ijmer.in

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:12(1), December: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd December 2023
Publication Date:30th December 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

# స్వయం సిద్ధ - మహిళా చైతన్యం

డా. ఎ. సునీత,
అసోసియేట్ ప్రొఫెసర్
ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల (అటానమస్),
బేగంపేట.

**Abstract :** విశ్వసాహిత్యంలో అత్యంత పాఠకాదరణ పొంది ఆధునిక సాహిత్య ప్రక్రియలలో తనకంటూ ఒక విశిష్టస్థానాన్ని సంపాదించుకొన్నది నవలా ప్రక్రియ. తెలుగులో మధ్యతరగతి అక్షరాస్య జన ప్రపంచ సంబంధంతో ఎదిగిన ఈ నవలా ప్రక్రియను చేపట్టిన తొలితరం రచయిత్రులలో కోడూరి కౌసల్యాదేవి ఒకరు. 1962వ సంవత్సరంలో నవలా రచనకు శ్రీకారం చుట్టిన కౌసల్యాదేవి గారు తన సాహితి వ్యాసాంగంలో అనేక నవలలు కథలు రాసి మధ్యతరగతి పాఠకుల హృదయాలలో చెరగని ముద్ర వేసారు. వీరు రచించిన స్వయం సిద్ధ అనే నవల 1985వ సంవత్సరంలో ప్రచురింపబడింది. ఇందులో మహిళలు స్వయం సిద్ధలై సాధికారత సాధించాల్సిన ఆవశ్యకతను వివరించారు కౌసల్యాదేవిగారు. తరతరాలుగా పురుషాహంకార పితృస్వామ్య సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను చిత్రించడమే గాక ఆ సమస్యల సాధనలో కొత్త మార్గాలను అన్వేషించడం ఈ నవలలో కనిపిస్తుంది. వారు ఈ నవలలో చర్చించిన మహిళల సమస్యలను మరియు అందించిన చైతన్య భావనలు పరిశీలించడమే ఈ వ్యాస ప్రధానోద్దేశ్యము.

**కీలకపదాలు :**

1. నవలా ప్రక్రియ 2. మధ్యతరగతి 3. స్వయం సిద్ధ
4. మహిళా సమస్యలు 5. చైతన్య భావనలు

ఈ నవలలో ప్రొఫెసర్ రామానందం భార్య సుభద్ర వివాహం అయిన తర్వాత చదువుకోవాలని ఆశపడుతుంది. కానీ భర్త కుసంసార్కం ఆమె ఆశను అణచుకునేలా చేస్తుంది. కనీసం మహిళా మండలి సభ్యులతో కలసి మంచి పనులలో పాలు పంచుకోవాలనుకుంటుంది సుభద్ర. ఈ సందర్భంలో రామానందం "జాగ్రత్త చంపేస్తాను. నువ్వు ఊరి మీద షికార్లు మరిగితే నేను వంటింటి పని చూడాలా, నీకు చీరలుతికి పెట్టాలా? ఇడియట్ పని పాటా లేక తిరిగే వాళ్ళందరితో చేరి పాడైపోనీయడానికి నేనేమి అసమర్థపు

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:12(1), December: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd December 2023
Publication Date:30th December 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

Cover Page


DOI: http://ijmer.in.doi./2023/12.12.20.3.39
www.ijmer.in

భర్తను కాను. ఖబడ్దార్" అంటూ హెచ్చరిస్తాడు. సుభద్ర ఆడపిల్లకు జన్మనిచ్చిందని తెలిసిన సందర్భంలో "ఛీ, నా నెత్తికో గుదిబండను తయారు చేశావా" (పు. 23) అంటూ అసహ్యించుకుంటాడు. అడుగడుగునా హద్దులు మీరి ప్రవర్తించే భర్త అహంకారం సుభద్ర సుకుమార హృదయంపై సమ్మెట పోటులు కొట్టింది. కొంచెం కొంచెం ఆమె హృదయాన్ని చెదపురుగులలా దొలచి వేస్తుండేది. క్రమక్రమంగా ఆమె మానసిక రోగిగా తయారౌతుంది. తల్లిదండ్రులు "ఏం తక్కువ నీకు" వెధవ పెంకితనం, చక్కటి భర్త, కంటికింపైన చీరలూ నగలతో నిన్ను ముంచేస్తుంటే ఇంకా ఏం కావాలి? అని మందలించారే గాని ఆమె అంతర్గత సంఘర్షణను అర్థం చేసుకోలేక పోయారు.

మానసిక జాడ్యంతో బాధపడుతున్న భార్యను చూసి రామానందం "ఎప్పుడూ పెంకిదే. ఎవర్ని పోషించాలి అది ఇప్పుడు చదువుకునీ, ఉద్యోగం చేసీ? ఆ చదువు వద్దన్న దగ్గర్నుంచీ అలా ముఖం వాడిపోయింది. ఇప్పుడు మూగమొద్దు కూడా అయింది. అవనీయండి, నాకేం బెదిరింపా? ఆ పెంకెతన మేమిటో చూస్తాను. చదవడానికి వీల్లేదు" (పు. 24) అంటూ ఖచ్చితంగా తన నిర్ణయాన్ని ప్రకటిస్తాడు. భర్త నిరంకుశ ధోరణికి గురి అవుతూ సుభద్ర అనునిత్యం మౌన రోదనతోనే కాలం గడిపేది. "ఎందుకేడుస్తున్నావమ్మా?" అని ప్రశ్నించిన కూతురితో "ఆడదాన్ని కదమ్మా అందుకు. ఏ తప్పు లేకపోయినా ఆడది ఇలా ఏడుస్తూ, అడుగడుగునా తిట్లూ, అధికారాలు భరిస్తూ బ్రతకాలి. నా ఖర్మ కొద్దీ నువ్వూ ఆడ దానివే పుట్టావు. నువ్వే మగవాడివైతే ఈ పాటికి నేను నిశ్చింతగా చచ్చేదాన్ని" అని చెప్పిన సమాధానం పరిశీలించదగినది. ఆడపిల్లలు పుడితే మగవారి కన్నా ఆడవాళ్ళకే అధిక బాధ అన్న అపప్రధ సమాజంలో వ్యాపించి ఉంది. సమాజంలో ఆడపిల్లలుగా పుట్టిన దగ్గర్నుంచీ అనుభవిస్తున్న పరాధీన జీవితం, వ్యక్తిత్వం ఏర్పరచుకోవడానికి అవకాశం లభించని నికృష్ట జీవితం చూసిన స్త్రీలు, పగవారికి కూడా అలాంటి జీవితం వద్దనుకుంటారు. ఇలాంటి నేపథ్యం గల పరిస్థితుల వల్ల తమకు ఆడపిల్లలు పుడితే తామనుభవించిన హీన దీన స్థితులు వారికి తప్పవనే స్పృహ వారిని ఆందోళనకు లోను చేస్తుంది. అంతేగాని తమ జాతిని అసహ్యించుకునే సంకుచితత్వం కాదది అని సుభద్ర అన్న మాటలు ఋజువు చేస్తున్నాయి.

రామానందం తన కూతురు నీరజ స్వాతంత్ర్య మీద ఉపన్యాసం ఇచ్చి ప్రథమ బహుమతి గెలుచుకున్నదని తెలిసిన సందర్భంలో ఆమె పెంపకపు బాధ్యతను వహించిన తన చెల్లెలు శ్యామలను "స్త్రీ స్వాతంత్ర్యం, చెత్తా చెదారం అని ఉపన్యాసాలిస్తే ఏదో పోటీలో ప్రథమ బహుమతి వచ్చిందట వాళ్ళంతా ఇటువంటివి గొప్ప అనుకుని పొగుడుతారు. ఆడదానికి ఆ మిడిసిపాటే అధఃపాతాళానికి దారితీస్తుంది. నీకు తెలుసా అది  ఆ పోటీ కెళ్ళినట్లు" అని నిలదీస్తాడు.

ఒకరోజు రాత్రి నీరజ పొద్దుపోయే వరకు చదువుకున్నదనీ, అందువల్ల ఉదయాన్నే లేవలేకపోయిందని తెలుసుకొని రామానందం "ఆడదానికి అంత చదువు యావ అక్కర్లేదు. బుద్ధిలేనివాళ్ళు తప్ప ఆడవాళ్ళను పై చదువులు చదివించరు. గతిలేని వాళ్ళు మినహా ఆడదాని చేత ఉద్యోగం చేయించుకు తినరు" అంటాడు.


Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:12(1), December: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd December 2023
Publication Date:30th December 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

DOI: http://ijmer.in.doi./2023/12.12.20.3.39
www.ijmer.in

ఆడపిల్లకు తన కాళ్ళపై తాను నిలబడగలిగేంత చదువుకావాలి అన్న శ్యామలతో "అదే.. అదే..ఆ వెర్రి మొర్రి ఊహలన్నీ వెర్రితలలు వేయకముందే దాని పెళ్ళి చేసేయాలి. ఇదేం ఉద్యోగాలు చేయక్కరలేదు. ఊళ్ళూ ఏలనక్కరలలేదు" అంటాడు. తన కోసం ఇంటికి వచ్చిన అతిథితో నీరజ మాట్లాడటాన్ని సహించలేక పోతాడు. "అయినింటి ఆడదానికి కొన్ని హద్దులు పద్ధతులు ఉంటాయి. చవకబారు దానిలా విరగబడకు. ఇదే ఆఖరుసారి చెప్పడం. ఈ రోజు నుండి నువ్వెక్కడికి వెళ్ళనవసరం లేదు. ఈ చదివిన చదువు చాలు, ఇంటిలో ఉండి పనీపాటా, వంటావార్పు నేర్చుకో మగరాయుడిలా తిరగడం మాను" అని తీవ్రస్థాయిలో మందలిస్తాడు. అభివృద్ధిలో స్త్రీలకు భాగం ఉన్నదనటానికి వాళ్ళకు ఏ మేరకు విద్య అందుతున్నదనేది ఒక గీటురాయి. విద్య విషయంలో స్త్రీ ఇంత అణచివేతను, అవరోధాన్ని ఎదుర్కొంటున్నదంటే ఆమె అభివృద్ధి సరిహద్దుల దగ్గరకు కూడా రాలేకపోతున్నదనే అర్థం.

నీరజ మేనత్త శ్యామల తమ తరం బాల్యంలో ఆడపిల్లలుగా ఎదుర్కొన్న అనుభవాలను చెపుతూ "అన్నదమ్ములతో సరిసమానంగా ఆడుతూంటే అదేమిటే ఆ చెట్లెక్కడం మగాడిలాగా? కాని అమ్మ కోప్పడేది. మగాళ్ళతో సమంగా గాలి పటాలటే మీకు? అని అమ్మమ్మ మొట్టికాయలు వేసి మరీ ఆటలు మాన్పించేది. ఇంటిపనులు చేయించేది. మేం చేయలేమంటే రేపు అత్తింట్లో ఇలాగంటే గడ్డిపెడతారే. తన్ని మరీ చేయించు తారే" అంటూ మాటలు అనేవారు. "ఇటువంటివన్నీ వింటూ పెరిగి మగవాళ్ళలో చిన్ననాటి నుండి ఆ అహంకారం ప్రాణం పోసుకొని కాలక్రమేణ రూపుదిద్దుకొని వాళ్ళతో పాటూ పెరిగి మహావృక్షమౌతుంది. అందుకే మగవారిదే కేవలము తప్పని అనలేను నీరూ. అన్నయ్యలతో పొలం వెళ్ళి అక్కడ సైక్లింగ్ నేర్చు కున్నందుకు ఒకసారి చావుదెబ్బలు తిన్నాను నేను అమ్మచేతిలో. నాన్న తెగ తిట్టారు" అని చెప్పిన మాటలు పరిశీలింపదగినవి. పుట్టుకతో సమానులైన ఇరువురు బిడ్డలను స్త్రీ, పురుషులుగా తయారు చేయటంలో తల్లిదండ్రులకు సుశిక్షణను ఇచ్చిన పితృస్వామ్య సమాజ విష సంస్కృతి ఈ సందర్భంలో కళ్ళకు కట్టినట్లు కనిపిస్తుంది.

చదువుల విషయంలో తమకు జరిగిన అన్యాయాన్ని శ్యామల నీరజకు చెపుతున్న సందర్భంలో "ఆడది పరాయి ఇంటికి వెళ్ళిపోతుంది. అంచేత దాన్ని చిన్నప్పట్నుంచి "మైనస్" అనే పిలిచే కుటుంబా లున్నాయి.మగవాడు "ప్లస్" అనిపించుకుంటాడు. అతడు ఎన్నిసార్లు పరీక్ష తప్పినా ఎన్ని వెధవపనులు చేసినా గణనకు రానీయని తల్లిదండ్రులే కుమార్తె విషయంలో తూచితూచి ఖర్చు పెడతారు. ఎంత చదివినా కట్నం ఇవ్వడం పెళ్ళి ఖర్చు తప్పదుగా! అంటూ మమ్మల్ని పెద్ద చదువులు చదువుకోనీయలేదు. మీ అమ్మ చనిపోయింది. నేను మొండిగా బ్రతికి ఉన్నాను. కానీ మనసులో ఆరనిజ్వాల మాత్రం విజ్ఞానతపన ఉన్న ప్రతి స్త్రీకి ఉంటుంది నీరూ" అంటుంది. తరతరాల అణచివేత స్త్రీల సహజ వికాసాన్ని ఏ విధంగా దిగ్బంధం చేసిందో నిరూపించే సందర్భమిది.

Cover Page

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:12(1), December: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd December 2023
Publication Date:30th December 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

DOI: http://ijmer.in.doi./2023/12.12.20.3.39
www.ijmer.in

భర్తను పోగొట్టుకొని తోడబుట్టిన వారి నీడన బ్రతుకుతున్న శ్యామల అన్నచేత చులకనగా చూడబడుతుంది. ఈ సందర్భంలో నీరజ "మా డాడీ లాగే నువ్వూ ఈ ఇంట్లో ఆయనతో సమంగా పుట్టావు, పెరిగావు. మరి నీకీ ఇల్లు పరాయిదేమిటి? నువిక్కడ ఎందుకు చులకన కావాలి?" అని అడుగుతుంది. ఈ సందర్భంలో శ్యామల "మన వ్యవస్థలోనే ఉన్నది ఈ లోపం, మన సాంఘికాచారాలు, పద్ధతులే అలా ఉన్నాయి. ఒక ఇంటి కూతురిగా మరొక ఇంటి కోడలుగా బ్రతికే మన దేశపు స్త్రీకి చెట్లమీద పెరిగే బదనికకూ తేడా కనిపించదు. తనకంటూ ఒక ఇంటిపేరు లేదు. తనదంటూ ఒక ఇల్లు ఏర్పడుతుందని పెళ్ళి చేస్తారు. కానీ అందులో నిజమెంత? అంటుంది. పుట్టింట్లో ఆమె ఆడపిల్లే గాని, ఈడ పిల్ల కాదు. అత్తిల్లు ఎన్నటికీ ఆమె ఇల్లు కాదు. ఆ ఇంటికీ సర్వ చాకిరీ చేస్తూ తనేమీ కాకుండా మిగిలిపోయే బ్రతుకు స్త్రీది.

పితృస్వామ్య సమాజం స్త్రీలకు పెళ్ళిని జీవిత లక్ష్యంగా చేసింది. పెళ్ళితో స్త్రీల జీవితాలకు స్థిరత్వం ఏర్పడుతుందని వారి జీవితానికి పరిపూర్ణత సిద్ధిస్తుందని చెప్పి నమ్మించారు. సరైన వ్యక్తి లభించకపోతే ఇక ఆ స్త్రీ జీవితమంతా నరకప్రాయమే అవుతుంది. శారీరకంగా, మానసికంగా బలహీనులను చేసి మరణం వైపు వారి జీవితాలను నెడుతుంది. నీరజ తల్లి సుభద్ర జీవితం ఆవిధంగానే అర్ధాంతరంగా ముగిసింది. స్త్రీ అస్థిత్వం పూర్తిగా అభావమైపోతున్న స్థితి. స్త్రీకి తనకంటూ ఒక ఉనికి, ఒక స్థానం లేని పరిస్థితి అందువలన వాళ్ళలో ఏర్పడుతున్న డొల్లతనం, నిస్సహాయ క్రోధం శ్యామల మాటలలో వ్యక్త మవుతాయి.

ఒక వివాహ వేడుకకు వెళ్ళిన నీరజతో శ్రీనివాస్ వివాహ తంతులోని లోపాల గురించి చెబుతూ "మైనార్టీ తీరిన వాళ్ళను తల్లిదండ్రులు ధారపోయడమేమిటి? ఒక వస్తువునో, జంతువునో ఇచ్చినట్లు ఈ కన్యాదానమేమిటి? దాన వస్తువుగా ఆడదాన్ని కించపరుస్తున్న ఈ వివాహ వ్యవస్థను సవరించి దర్జాగా సమానత్వంతో గృహిణిత్వాన్ని పొందండి. 'కన్యాదానం', 'కాళ్ళు కడగడం' అనే పదాల్ని వివాహ తంతు నుండి తొలగించండి. అప్పుడు మీ చదువులకు సార్థకత వస్తుంది" అంటాడు.

18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువతీయువకులను స్వతంత్రులుగా ప్రకటించింది ప్రభుత్వం. ఈ విధంగా మైనారిటీ తీరి స్వీయ నిర్ణయాలను తీసుకోగల వ్యక్తులను దానం చేసే ప్రక్రియ నాగరికత మారి ఎంతో అభివృద్ధిని సాధించి ఆధునిక యుగంలోకి అడుగుపెట్టి, అద్భుత ఆవిష్కరణలు జరుగుతున్న నేపథ్యంలోను మారలేదు. దీన్ని ఆధునిక యువత గుర్తించి సంస్కరించాల్సిన ఆవశ్యకతను శ్రీనివాస్ మాటల ద్వారా వ్యక్తం చేసింది కౌసల్యాదేవి.

శ్యామల కూతురు సరోజ భర్త హఠాత్తుగా గుండెపోటుతో మరణిస్తాడు. ఈ సందర్భంలో సరోజ తన చదువుకు ప్రాముఖ్యత ఇవ్వకుండా పెళ్ళికే ప్రాధాన్యతనిచ్చి తన జీవిత గమ్యాన్ని నిర్దేశించిన రామానందంతో "రక్ష అయిన పెళ్ళి ఇలా శిక్షగా మారి ఏడ్పించుతున్నదేం?" అని ఆవేదనను వ్యక్తం

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:12(1), December: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd December 2023
Publication Date:30th December 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf
Cover Page
DOI: http://ijmer.in.doi./2023/12.12.20.3.39
www.ijmer.in


చేస్తుంది. ఏ వైవాహిక జీవితం స్త్రీలకు భద్రతను కల్పిస్తుందని సమాజం నమ్మించిందో ఆ వైవాహిక జీవితం విఫలమైనపుడు స్త్రీల బ్రతుకు పునాదుల నుండి కదిలి కకావికలమౌతుందని అర్థం అవుతుంది.

నీరజ తమ కుటుంబంలోనే తన తల్లి సుభద్ర, మేనత్త శ్యామల, మేనత్త కూతురు సరోజ వైవాహిక జీవితాలు విఫలం కావడం చూసి వివాహంపై విముఖత పెంచుకుంటుంది. ఈ సందర్భంలో ఆమె “వివాహం ఎవరి మట్టుకు వారి ఒక్క జీవితానికి స్థిరత్వం ఇవ్వవచ్చు. వికటించితే మరింత అస్థిరత్వానికి లోను చేయవచ్చు. నిర్ధిష్టత లేని ఈ వ్యవస్థతో నేను లాటరీ ఆడదలచుకోలేదు. ఈ ప్రపంచాన్ని చూచి చూచీ నేనర్థం చేసుకున్నది ఒక్కటే. ఆడదానికి వివాహం అన్ని విధాలా అనర్ధ హేతువు చేయాలనుకున్న మంచి పనులు చేయనీయని ప్రతిబంధకం” అందుకే నేను వివాహం చేసుకోదలచుకోలేదని ఖచ్చితంగా శ్యామలతో చెప్పేస్తుంది నీరజ.

నీరజ మనసును మార్చాలని ఆమెను తన స్నేహితురాలు కమల వద్దకు తీసుకుపోతుంది శ్యామల. కమలకు ఆమెకంటె పది పన్నెండేళ్ళు పెద్దవాడైన వ్యక్తితో వివాహం జరిపిస్తారు. పెద్దలు అతనికి ఉన్న భయంకర వ్యాధులు దాచిపెడతారు. దాంతో పెళ్ళయిన నెలరోజులకే కమల వితంతువుగా మారుతుంది. నిస్సారమైన తమ జీవితాన్ని చూసుకొని కృంగిపోకుండా ధైర్యంగా బయటి ప్రపంచంలో అడుగిడి తన అన్న స్నేహితుడైన ఒక మహమ్మదీయుని వివాహం చేసుకొని సుఖసంతోషాలను స్వయంగా సిద్ధింప చేసుకుంటుంది. పెద్దల చేతుల్లో జీవితాన్ని పెడితే జరిగిన పరిణామాలను చవిచూసిన కమల, మరోసారి అలాంటి పొరపాటు చేయక తన జీవితాన్ని తానే నిర్ణయించుకుంటుంది. తన వ్యక్తిత్వానికి తగినట్లుగా జీవితాన్ని మలచుకోవడంలో విజయం సాధిస్తుంది. అభాగ్యులైన స్త్రీలకు ఆశ్రయాన్ని కల్పించి ఆదుకుంటూ మరోవైపు పాఠశాలను స్థాపించి ఉన్నత విలువలను పిల్లలకు అందించడంలో కృతార్థురాలవుతుంది.

కమల నీరజతో స్త్రీ పురుష అసమానత గురించి చెపుతూ, “సహజీవన ధర్మంలో పురుషాధికారం, స్త్రీ బానిసత్వం అనే రెండు పదాలు వెలసి కలుషితం చేశాయి. ఈ కలుష కారకులు స్వార్ధపరులైన వ్యక్తులే కానీ ప్రత్యేకంగా స్త్రీలనీ, పురుషులనీ విశ్లేషించలేము. సంఘమంతా ఈ కాలుష్యం ఆవరించింది. ఈ కాలుష్య నివారణ కూడా చాల వరకు మన స్త్రీల చేతులలోనే ఉన్నదని నా అభిప్రాయం. పసిబిడ్డలు తమ పరిసరాల చుట్టూ జరుగుతున్న వాటిని తమ చుట్టూ ఉన్న వారిని చూస్తూ వింటూ బ్రతుకు ప్రారంభిస్తారు. పెరుగుతారు. అందుకే ఆడది అలా ఉండాలి. మగవాడిలా ఉండాలి అనే అర్థం లేని మాటలు, నియమాలు మన స్త్రీలందరినీ వదిలిన నాడు సమాజ స్వరూపమే మారగలదని నా ఉద్దేశ్యం” అని అంటుంది. కమల అన్న మాటలలో స్త్రీ పురుష అసమానతలకు స్త్రీ పురుషులిరువురూ కారకులే అయినప్పటికీ నష్టపోయిన స్త్రీ జాతి నుండే పరివర్తనకు అడుగులు పడాలని కమల చెప్పడం ఒక వైరుధ్యం.

ఎన్నికలలో ఓట్లు వేసి ప్రచారం చేసి సహకరించమని వచ్చిన రాజకీయ వర్గాలతో కమల “తాను పుట్టిన ఇంటనే పరాయిదిగా చూడబడి తనకు ఖర్చు పెట్టబడే ప్రతీ పైసాకు పది మంది ఏడ్చే స్థితిలో


Cover Page

DOI: http://ijmer.in.doi./2023/12.12.20.3.39
www.ijmer.in

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:12(1), December: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd December 2023
Publication Date:30th December 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

ఉన్న ఆడది, తన సోదరునితో సమంగా తన తల్లిదండ్రుల ఇంట ఉండగల హక్కు ఆస్తి పంచుకునే హక్కు లేని ఆడది తన సోదరునితో సమంగా చదువుకునే హక్కులేని ఆడది బలిపశువులా తలవంచి తాళి కట్టించుకొని దాసిగా బ్రతికే ఆడది, ఖర్మకొద్దీ భర్తతో తగవు వస్తే తాను గర్భాన మోసిన కన్నబిడ్డలపై కూడ హక్కు కోల్పోయే ఆడది భర్తకూ, భర్త ఇంటి వారికి ఇష్టమైతే సంసారం చేసి లేకుంటే బయటకు నెట్టబడే ఆడది, మగతోడు లేనిదే భద్రంగా బయట తిరగలేని ఆడది, తన ఇష్టానుసారం తన జీవితాన్ని మలచుకోలేని ఆడది ఈ ఓటు హక్కువల్ల పొందిన లబ్ది ఏమిటి?" అంటూ ప్రశ్నిస్తుంది. ప్రజాస్వామ్య విధానం అమలు అవుతున్న దేశాలలో ప్రజలదే అధికారం ఇలాంటి విధానాన్ని అమలు పరుస్తున్న మనదేశంలో ప్రజలలో సగభాగమైన స్త్రీల జీవితాలలోని బానిసత్వాన్ని రూపుమాపుటలో ప్రభుత్వం విఫలమైంది. తమ జీవిత నిర్ణయాలపైనే తమకు హక్కు లేని స్త్రీలు దేశాన్ని పాలించే పాలకులను నిర్ణయించటం అర్థరహితమైనదిగా కమల భావించింది. అందుకే రాజ్య విధానాల పైన తన నిరసన గళాన్ని ప్రకటించింది.

నిజానికి ప్రపంచ దేశాలు ఏవీ స్త్రీలకు ఓటుహక్కు కల్పించలేదు. పాశ్చాత్య దేశాల మహిళలు తమకు రావాల్సిన న్యాయమైన అనేక అంశాలను ఉద్యమాల ద్వారానే సాధించారు. ప్రపంచ దేశాలలో మహిళలకు ఓటుహక్కును మొదట కల్పించిన దేశం న్యూజీలాండ్, ఆ తర్వాత అనేక దేశాలు మహిళలకు ఓటు హక్కు ప్రసాదించాయి. మనదేశంలో కూడా ఓటుహక్కును సాధించడానికి మహిళలు కృషి చేశారు.

1919లో మాంటేగ్సు- ఛెమ్స్‌ఫర్డ్ కమీషన్‌కు స్త్రీల ఓటింగ్ హక్కు గురించి విజ్ఞాపన పత్రాన్ని కజిన్స్ సతి, సరోజినీ నాయుడు సమర్పించారు. కలకత్తా కాంగ్రెస్ మహాసభ అనీబిసెంట్ అధ్యక్షత క్రింద స్త్రీలకు ఓటుహక్కు ఇవ్వాలని తీర్మానించింది.

1920లో మనదేశంలో మొదటి సారిగా శాసనసభకు స్త్రీలు పోటీ చేయడానికి ప్రభుత్వం అంగీకరించింది. 1927లో సైమన్ కమీషన్ 2 : 1 పురుషులు, స్త్రీల నిష్పత్తిలో ఓటింగ్ హక్కును కల్పించడం జరిగింది. 1947లో బారత రాజ్యాంగ చట్టంలో వయోజన ఓటింగ్ హక్కులో స్త్రీలకు సమాన ఓటు హక్కు లభించింది. అయినా అణచివేయబడిన స్త్రీల జీవితాలలో ఏ మార్పు రాలేదు. అందుకే కమల "స్త్రీకి నేను పైన ఉదహరించిన ప్రతి విషయంలోనూ పురుషునితో సమాన ప్రతిపత్తి లభించిన నాడే నేను నా ఓటు హక్కును వినియోగించుకుంటాను. స్వాతంత్ర్యం పొందిన ఇన్ని సంవత్సరాల తర్వాత కూడా చట్టం స్త్రీ విషయంలో చెప్పుకోదగినంతగా మారకపోవడం విచారకరం" అంటూ తన నిరసన గళాన్ని వినిపిస్తుంది. అయితే ప్రభుత్వం స్త్రీల కొరకు చేసిన చట్టాలు కాగితాల వరకే పరిమితం అవుతున్నాయి అనుటకు వరకట్న నిషేధ చట్టమే ప్రబల నిదర్శనం. ఒక సమస్య సంఘాన్ని కలచివేస్తున్నపుడు ప్రభుత్వం దాన్ని గుర్తించి, దాని నివారణకు శాసనాన్ని తీసుకొచ్చినా లాభం ఉండదు. ఆ శాసనాన్ని అందరు ఆచరించినపుడే దాని ప్రయోజనం సిద్ధిస్తుంది. గతంతో పోలిస్తే నేడు బాల్య వివాహాల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఇందుకు కారణం ప్రభుత్వం తీసుకువచ్చిన బాల్య వివాహ నిరోధక చట్టం కాదు. బాల్య వివాహాలు ఆరోగ్యకరం కాదనే చైతన్యం ప్రజలలో వ్యాప్తి చెందటమే.

Cover Page

DOI: http://ijmer.in.doi./2023/12.12.20.3.39
www.ijmer.in

INTERNATIONAL JOURNAL OF MULTIDISCIPLINARY EDUCATIONAL RESEARCH
ISSN:2277-7881; IMPACT FACTOR :8.017(2023); IC VALUE:5.16; ISI VALUE:2.286
Peer Reviewed and Refereed Journal: VOLUME:12, ISSUE:12(1), December: 2023
Online Copy of Article Publication Available (2023 Issues)
Scopus Review ID: A2B96D3ACF3FEA2A
Article Received: 2nd December 2023
Publication Date:30th December 2023
Publisher: Sucharitha Publication, India
Digital Certificate of Publication: www.ijmer.in/pdf/e-CertificateofPublication-IJMER.pdf

అదే విధంగా స్త్రీల జీవితంపై పితృస్వామ్య సమాజం విధించిన ఆంక్షలు అర్థరహితమైనవనే స్పృహ, చైతన్యం సమాజంలో కలిగినపుడే వారి నూతన జీవితానికి ద్వారాలు తెరచుకుంటాయి. ఇందుకు ముందుగా మహిళలే ముందడుగు వేయాల్సిన ఆవశ్యకతను, తమను తాము గుర్తించి, సంస్కరించుకొని, స్వయంసిద్ధలు అయి, సమాజ స్వరూపాన్ని మార్చాల్సిన ఆవశ్యకతను వివరించింది ఈ నవల.

**ఆధార గ్రంథాలు**

1. కోడూరి కౌసల్యాదేవి - స్వయం సిద్ధ నవల.
2. వల్లంపాటి వెంకట సుబ్బయ్య - నవలా శిల్పం.
3. కాత్యాయని విద్మహే - సంప్రదాయ సాహిత్యం, స్త్రీవాద దృక్పథం.